ప్రజాశక్తి
శుక్రవారం 17 ఫిబ్రవరి 2023
5
విజయనగరం

జాబ్‌మేళాలో 13 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి-బొబ్బిలి

రాజా కళాశాలలో గురువారం నిర్వహించిన జాబ్ మేళాలో 13 మంది ఉద్యోగాలు సాధించారు. హైదరాబాద్‌కు చెందిన ఎంఎస్‌ఎన్ ల్యాబ్స్ ఫార్మా కంపెనీ యాజమాన్యం జాబ్ మేళా నిర్వహించింది. జాబ్‌మేళాకు 50 మంది హాజరయ్యారు. బిఎస్‌సి విద్యార్థులు 9మంది, బికాం విద్యార్థులు నలుగురు ఉద్యోగాలు పొందారు. అభ్యర్థులను హెచ్‌ఆర్ ప్రతినిధులు చాణుక్య, స్వామి, విజయ్, పురుషోత్తం ఇంటర్వ్యూ చేశారు. ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులను కరస్పాండెంట్ సుజయకృష్ణ రంగారావు, యాజమాన్య ప్రతినిధి బదరీ, ప్రిన్సిపల్ వీరేంద్రకుమార్, ప్లేస్‌మెట్ ఆఫీసర్ శరత్ అభినందించారు.

నగరంలో ఫిల్లర్లతో నిలిచిపోయిన సంస్కృత హైస్కూల్లో అదనపు తరగతి గదుల నిర్మాణం

నాడు-నేడు.. ఇంకెప్పుడు?

పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రారంభించిన మనబడి నాడు-నేడు కార్యక్రమం.. నిధుల కొరతతో పడకేసింది. ఈ కార్యక్రమంలో రెండోదశ పనులు అస్తవ్యస్తంగా మారాయి. పేరుకు ప్రతిష్టాత్మక కార్యక్రమమే అయినా నిధుల విడుదలలో మాత్రం చిట్టచివర నిలవడంతో చాలాచోట్ల పనులు ఆగిపోయాయి. నిధులు రాకపోవడంతో పనులు చేసేందుకు ఎవరూ ముందుకు రావడం లేదు.

- నిధులు రాక నిలిచిపోయిన పనులు
- రెండోదశలో రూ.231.24 కోట్లకు ఇచ్చింది రూ.45.90 కోట్లే
- మెటీరియల్ కాంట్రాక్టర్లకు నిలిచిన చెల్లింపులు
- కమిటీలకు అరకొర నిధులు
- నిధులు రాక ముఖం చాటేస్తున్న వైనం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఉమ్మడి విజయనగరం జిల్లాలో 737 పాఠశాలల్లో రూ.231.24 వేల కోట్ల అంచనాతో నాడు-నేడు రెండో విడత పనులను 2021 ఆగస్టులో ప్రారంభించారు. ఏడాదిన్నర దాటిపోయినా ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులు కేవలం రూ.49.59 కోట్లే. మిగిలిన నిధుల విడుదలకు ఎంతకాలం పడుతుందో తెలియని పరిస్థితి కనిపిస్తోంది. దీంతో వైసిపి ప్రభుత్వానికి మిగిలిన ఏడాది కాలంలో ఈ పనులు పూర్తికావడం కష్టమేనని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నిధుల విడుదలలో వైఫల్యం

నాడు-నేడు నిధులు మొత్తం రాష్ట్ర ప్రభుత్వం నుంచే రావడం లేదు. ప్రపంచ బ్యాంకు నుంచి కొంతమేర రుణాన్ని సర్కారు సమీకరించింది. ఇక అమ్మబడి పథకంలో పాఠశాల భవన నిర్వహణ నిధి కింద కొంత మినహాయించుకుంది. తల్లులకు అందాల్సిన నిధుల్లో ముందుగానే కోత పెట్టినా, వాటిని కూడా ప్రభుత్వం ఇతరత్రా అవసరాలకు వాడేసింది. ఇలా వివిధ రూపాల్లో సమీకరిస్తున్నా సక్రమంగా నిధులు విడుదల చేయడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైంది. ఇటీవల మెటీరియల్ ధరలు భారీగా పెరిగిపోవడంతో ప్రభుత్వం అరకొరగా ఇస్తున్న నిధులు ఏమూలకూ సరిపోవడం లేదు. నిధులు విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.

విజయనగరం జిల్లా కేంద్రంలోని బాబామెట్టలో ఉన్న బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వసతులు చాలని కారణంగా 15 గదులు అదనంగా నిర్మించేందుకు నాడు-నేడు కార్యక్రమం కింద రూ.1.74 కోట్లతో పరిపాలన ఆమోదం ఇచ్చారు. మొదటి విడతగా రూ.35.6 లక్షలు విడుదల చేశారు. ఈ నిధులు ఉన్నంత వరకు నిర్మాణాలు చేపట్టారు. ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో మిగిలిన పనులు అర్థాంతరంగా నిలిచిపోయాయి. జిల్లాలో 737 పాఠశాలల్లో ఇదే పరిస్థితి నెలకొంది. ఎప్పటికి ప్రభుత్వం నిధులు విడుదల చేస్తుందో, ఎప్పటికి రెండో విడత నాడు-నేడు పనులు పూర్తి అవుతాయో ప్రభుత్వమే చెప్పాల్సి ఉంది.

20 శాతమే!

2021 ఆగస్టులో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. మనబడి నాడు-నేడు కార్యక్రమం రెండో విడత పనులకు శ్రీకారం చుట్టారు. 2022 జులై నాటికి పనులు పూర్తిచేస్తామని అప్పట్లో ప్రకటించారు. అయితే పరిపాలనా అనుమతులు ఇచ్చేందుకే సుమారు ఏడాది సమయం పట్టింది. ఇప్పటివరకూ విడుదల చేసిన నిధులతో పనులు చేసిన ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రుల కమిటీల సభ్యులు రావాల్సిన వాటి కోసం ఎదురుచూస్తున్నారు. 2023 ఫిబ్రవరి చివరికి పనులు పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ కేవలం 20 శాతం పనులు మాత్రమే జరిగాయి. మిగిలిన పనులు ఎప్పటికీ పూర్తవుతాయోనన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.

బాబామెట్టలో బాలికల హైస్కూల్ స్లాబ్ వేసి వదిలేసిన భవనం

సందడిగా రమాప్రభ నామినేషన్

- తరలివచ్చిన ప్రజాసంఘాల నాయకులు, పట్టభద్రులు
- పిడిఎఫ్ అభ్యర్థి గెలుపు... ఉత్తరాంధ్ర మలుపు : వక్తల ఉద్ఘాటన
- ప్రజల గొంతుకనవుతా : పిడిఎఫ్ పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి కె.రమాప్రభ

ర్యాలీలో పాల్గొన్న నాయకులు, పట్టభద్రులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

ఒకటే ఉత్సాహం.. ఉత్తేజం. ఉత్తరాంధ్ర ప్రజల గొంతులు ఒక్కసారిగా.. ఒక్కటై నినదించాయి. 'పిడిఎఫ్ గెలుపు.. ఉత్తరాంధ్ర ఉద్యమాల గెలుపు' అంటూ హోరెత్తాయి. మహిళల కోలాటాలు, యువత తీన్‌మార్ డోలు చప్పుళ్లు.. కేరింతలు, నృత్యాలతో విశాఖ నగరం గురువారం కొత్త ఎన్నికల ఉత్సాహాన్ని సంతరించుకుంది. ఉత్తరాంధ్ర ప్రాంత వెనుకబాటుతనంపై ప్రశ్నించేందుకు ప్రజల గొంతుకై ప్రోగ్రెసివ్ డెమొక్రటిక్ ఫ్రంట్ (పిడిఎఫ్) అభ్యర్థిగా పోటీ చేస్తోన్న విద్యాధికురాలు, సామాజిక కార్యకర్త డాక్టర్ కోరెడ్ల రమాప్రభ నామినేషన్‌కు గురువారం ఉదయం విశాఖకు ఉత్తరాంధ్ర ప్రాంతానికి చెందిన ప్రజాసంఘాలు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, పట్టభద్రులు, మహిళలు, నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో వచ్చి కదంతొక్కారు. భారీ ర్యాలీ, కలెక్టరేట్ వద్ద సభలో వందల మంది పాల్గొన్నారు. ఉత్తరాంధ్రకు ప్రత్యేక ప్యాకేజీ కావాలని, ప్రభుత్వ రంగ సంస్థలను రక్షించాలని, స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవాలని, రైల్వే జోన్ సాధన అవసరమని.. ఇలా సమస్య ఎక్కడ ఉంటే అక్కడ పరిష్కారం కోసం జరిగే పోరాటాలకు అండగా ఉండే పిడిఎఫ్ అభ్యర్థి గెలుపుకోసం పెద్దపెట్టున నినదిస్తూ విశాఖ రోడ్లపై వందలాది మంది ముందుకు సాగారు. డాబాగార్డెన్ సరస్వతీ పార్కు నుంచి జగదాంబ జంక్షన్ మీదుగా ఈ భారీ ర్యాలీ జిల్లా కలెక్టర్ కార్యాలయం వరకూ సాగింది. 250కు పైగా ప్రజా సంఘాలు బలపరుస్తున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ రమాప్రభకు వివిధ తరగతుల నుంచీ మద్దతు లభించింది. తొలుత అంబేద్కర్, తర్వాత తెన్నేటి, మదర్ థెరిసా విగ్రహాలకు పూలమాల వేసిన తర్వాత ర్యాలీ ఆరంభమైంది. గడచిన ఆరేళ్లుగా బిజెపి ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ ఒక్క ప్రజా సమస్యనూ పరిష్కరించలేదని, పైగా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణను నిస్సిగ్గుగా సమర్థించుకున్నాడంటూ ర్యాలీ సందర్భంగా సాధారణ జనం మండిపడ్డారు. కేంద్రంలోని నరేంద్రమోడీ సర్కారు విభజన హామీ చట్టంలోని ఏ ఒక్క అంశాన్నీ ఆంధ్రప్రదేశ్‌కు, ఉత్తరాంధ్రకు అమలు చేయకుండా తీవ్ర ద్రోహం చేస్తోందంటూ పలువురు ప్రజాసంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు, చిత్రంలో ఎమ్మెల్సీ అభ్యర్థి రమాప్రభ, ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, అజశర్మ

నిరంతర పోరాటశీలి పిడిఎఫ్ : వక్తలు

నామినేషన్ దాఖలు చేసే ముందు కలెక్టరేట్ వద్ద 250 ప్రజా సంఘాలు సహా పిడిఎఫ్ సంయుక్తంగా సభ నిర్వహించాయి. పిడిఎఫ్ ఎమ్మెల్సీ కెఎస్.లక్ష్మణరావు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, కార్మికులు, రైతులు, కాంట్రాక్టు, అవుట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలపై నిరంతరం మండలి బయటా, లోపలా పోరాడుతున్నామన్నారు. ఉత్తరాంధ్ర అభివృద్ధిపై పిడిఎఫ్ అభ్యర్థిగా నిలబెట్టిన డాక్టర్ కె.రమాప్రభకు అవగాహన ఉందన్నారు. మరో పిడిఎఫ్ ఎమ్మెల్సీ ఐ.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఉత్తరాంధ్రలో కోట్లకు పడగలెత్తే వారు ఓట్లు కోసం వస్తున్నారని, వారిని తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. పోరాడే వారిపై ఈ సర్కారు కక్ష కట్టిందని, ఉపాధ్యాయులు, ఉద్యోగులపై పెటీ కేసులు పెట్టడం సిగ్గుచేటని యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.వెంకటేశ్వర్లు అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్సీ ఎంవిఎస్.శర్మ మాట్లాడుతూ గడచిన ఆరేళ్లలో ఉత్తరాంధ్ర నుంచి పిడిఎఫ్ అభ్యర్థి మండలిలో లేనందున స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు బిజెపి ఒడిగట్టిందని, రైల్వే డివిజన్ పోయిందని, వస్తుందనుకున్న జోన్ రాకుండా కేంద్రం దొంగ నాటకాలతో కాలం నెట్టుకొస్తుందంటూ మండిపడ్డారు. పిడిఎఫ్ లేకపోతే విశాఖ, ఉత్తరాంధ్ర ప్రాంతానికి ఎంత అన్యాయం జరిగిందో చదువుకున్న వారంతా గుర్తించారన్నారు. తాజాగా అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన వారు ఎమ్మెల్సీగా పోటీచేస్తూ 'ఓట్లేయండి.. సేవ చేస్తాం' అంటూ పట్టభద్రుల ఓట్లను అడుక్కుంటున్నారని, గడచిన 30 ఏళ్లుగా ఉత్తరాంధ్రలో వివిధ తరగతుల ప్రజలకు రమాప్రభ సేవలందిస్తున్నారని శర్మ గుర్తుచేశారు.

ఉత్తరాంధ్రకు రూ.24 వేల కోట్లకు గాను రూ.450 కోట్లే వచ్చాయి : రమాప్రభ

ఉత్తరాంధ్ర వెనుకబాటుతనంపై ప్రశ్నించే గొంతులు మూగబోతున్నాయని, ఎపి విభజన హామీ చట్టం ప్రకారం ఈ ప్రాంతానికి రూ.24 వేల కోట్ల నిధులు అభివృద్ధి కోసం రావాల్సి ఉండగా కేవలం రూ.450 కోట్లే వచ్చాయని పిడిఎఫ్ అభ్యర్థి డాక్టర్ కోరెడ్ల రమాప్రభ తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తానని మోసం చేసిందన్నారు. ఉద్యోగులకు సిపిఎస్ రద్దు చేస్తానని చెప్పి మూడున్నరేళ్లయినా మీనమేషాలు లెక్కిస్తోందన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సాగుతున్న ఉద్యమాలకు, రైల్వే జోన్ సాధనకు సాగుతున్న పోరాటాలకు అండగా ఉంటానన్నారు.

పెద్ద సంఖ్యలో ఉద్యమ, ప్రజా సంఘాల నేతలు హాజరు

ఉత్తరాంధ్ర అభివృద్ధి వేదిక ప్రధాన కార్యదర్శి ఎ.అజశర్మ అధ్యక్షతన సాగిన సభలోనూ, రమాప్రభ నామినేషన్ ర్యాలీలోనూ ఉద్యమ నేతలు సి.హెచ్.నర్సింగరావు, కె.లోకనాథం, ఎం.జగ్గునాయుడు, డాక్టర్ బి.గంగారావు, తమ్మినేని సూర్యనారాయణ, రెడ్డి వేణు, గోవిందరావు, అప్పలనర్స, ఎం.పైడిరాజు, యుటిఎఫ్ రాష్ట్ర నాయకులు విజయగౌరి, రాము, తదితరులు పాల్గొన్నారు.

తహశీల్దార్ కార్యాలయం ముందు నిరసన చేపడుతున్న టిడిపి నాయకులు, నిర్వాసితులు

ప్యాకేజీ ఇవ్వకుండానే ఖాళీ చేయిస్తారా?

అధికారుల తీరుపై తహశీల్దార్ కార్యాలయం వద్ద నిరసన

ప్రజాశక్తి -భోగాపురం

భోగాపురం ఎయిర్‌పోర్టు నిర్వాసిత గ్రామమైన జమ్మయ్యపేటలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వకుండా ఇళ్లు ఖాళీచేయాలని చూడటం సరికాదని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు.. అధికారులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. అధికారుల తీరుపై గురువారం సాయంత్రం స్థానిక తహశీల్దార్ కార్యాలయం ఎదుట టిడిపి ఆధ్వర్యాన నిర్వాసితులు నిరసన చేపట్టారు. ఆందోళన వద్దకు వచ్చిన తహశీల్దార్ కె.శ్రీనివాసరావుతో బంగార్రాజు మాట్లాడారు. అర్హులైన వారికి తగిన ప్యాకేజీ ఇచ్చిన తర్వాతే, ఇళ్లు ఖాళీ చేయించాలని డిమాండ్ చేశారు. లేకుంటే కోర్టును ఆశ్రయించైనా బాధితులకు న్యాయం చేకూరేలా చూస్తామని చెప్పారు. కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు నీలపు అప్పలరామి రెడ్డి, మండల ఉపాధ్యక్షులు కోలా రామసూరి, నాయకులు సరగడ తోగులు రెడ్డి, బాలు, బైరెడ్డి సోమిరెడ్డి, కిలుము రామారావు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో భయం.. భయం

వంగర మండలంలోకి ప్రవేశించిన గజరాజుల గుంపు ● ధాన్యం, మొక్కజొన్న పంట ధ్వంసం

ప్రజాశక్తి-వంగర

కొద్దిరోజులుగా పార్వతీపురం మన్యం జిల్లాలో సంచరిస్తూ ఆస్తి, ప్రాణనష్టం కలిగించిన ఏనుగుల గుంపు.. బుధవారం అర్ధరాత్రి వంగర మండలంలోకి ప్రవేశించింది. ఏనుగుల గుంపు సంచారంతో మండల ప్రజలు హడలిపోతున్నారు. బలిజిపేట మండలం నుంచి సువర్ణముఖి నదిని దాటుకుంటూ వంగర మండలంలోని కొప్పర కొండచాకరాపల్లి మీదుగా లక్ష్మింపేటకు చేరుకున్నాయి. రైతులు గంటేడ కృష్ణ, గంట్యాడ ఆదికి చెందిన ధాన్యం బస్తాలను ధ్వంసం చేశాయి. అక్కడ నుంచి తలగాంలో పొలాల్లోకి చేరుకొని మొక్కజొన్న పంటను నాశనం చేశాయి.

తలగాంలో రైస్ మిల్లు వద్ద సంచరిస్తున్న ఏనుగుల గుంపు

లక్ష్మింపేటలో ఏనుగులు ధ్వంసం చేసిన ధాన్యం

ఈ సమాచారం తెలుసుకున్న తహశీల్దార్ డి.ఐజాక్ తలగాం గ్రామంలో దండోరా వేయించి ప్రజలను అప్రమత్తం చేశారు. విజయనగరం అటవీ శాఖ రేంజ్ అధికారి బి అప్పలరాజు, బొబ్బిలి డిప్యూటీ రేంజ్ అధికారి జమ్మాన సుధీర్, ఫారెస్ట్ బీట్ అధికారులు కర్రి స్వప్న, కావ్య కిరణ్, సెక్షన్ అధికారి కెవిఎన్ రాజు ఏనుగుల సంచరిస్తున్న ప్రాంతానికి చేరుకొన్నారు. ఏనుగుల కదలికలను పరిశీలించారు. ఎవరూ కూడా ఏనుగుల వద్దకు వెళ్లొద్దని అప్రమత్తం చేశారు. తలగాం, రుషింగి, రాజులకుమ్మడ, వివిఆర్‌పేట, బంగారువలస, కె.కొత్తవలస గ్రామాల్లో విద్యుత్తు ఎఇ వినయ్‌కుమార్ గురువారం ఉదయం నుంచి కరెంటు సరఫరా నిలిపేశారు. ఈ కార్యక్రమంలో విఆర్‌ఒ బంటు రాములు, వంగర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తీర్థయాత్రకు భారత్ గౌరవ్ ట్రైన్

ప్రజాశక్తి-విజయనగరం కోట

తీర్థయాత్రకు భారత్ గౌరవ్ ట్రైన్‌ను ప్రారంభిస్తున్నట్లు ఐఆర్‌సిటిసి ప్రాంతీయాధికారి చంద్రమోహన్ బిస్వా తెలిపారు. ఈ మేరకు యాత్రకు సంబంధించి బ్రోచర్‌ను గురువారం స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రత్యేక రైలు మార్చి 18న రాత్రి సికింద్రాబాద్‌లో ప్రారంభమై కాచిగూడ, రాజమండ్రి, విశాఖ, విజయనగరం మీదుగా యాత్ర సాగుతుందని తెలిపారు. ఏడు రాత్రులు, ఎనిమిది రోజులపాటు యాత్ర ఉంటుందని వివరించారు. పూరి, వారణాసి, కాశీ, తదితర ప్రాంతాలను సందర్శించవచ్చని చెప్పారు. ఉదయం కాఫీ, టిఫిన్, మధ్యాహ్న, రాత్రి భోజనం, టిఫిన్, రాత్రి ఎక్కడైన బస చేస్తే రూమ్ ఛార్జీలు.. మొత్తమంతా ఐఆర్‌సిటిసి టూరిజం ప్యాకేజీలోనే భరిస్తున్నట్లు తెలిపారు. తక్కువ ఖర్చుతో ఎక్కువ యాత్రలను చేయొచ్చని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

యాత్ర బ్రోచర్‌ను విడుదల చేస్తున్న ఐఆర్‌సిటిసి ప్రాంతీయ అధికారి చంద్రమోహన్



దీక్షలు చేస్తున్న జర్నలిస్టులు

జర్నలిస్టుల స్థలాల్లో ఆక్రమణలు తొలగించాలని దీక్ష

టిడిపి, సిపిఎం, సిపిఐ, కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ, లోక్‌సత్తా సంఘీభావం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

కె.ఎల్.పురంలో జర్నలిస్టులకు కేటాయించిన స్థలంలో ఆక్రమణలు తొలగించాలని, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని గురువారం కలెక్టరేట్ ఎదుట నగరంలోని జర్నలిస్టులు నిరసన దీక్ష చేపట్టారు. కెఎల్‌పురంలో తమకు కేటాయించిన స్థలంలో బయట వారు వచ్చి ఆక్రమించుకొని నిర్మాణాలు చేపట్టడం దారుణమని జర్నలిస్టులు ఆవేదన వ్యక్తంచేశారు.

ఈ దీక్షా శిబిరాన్ని టిడిపి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షులు కిమిడి నాగార్జున, జిల్లా ప్రధాన కార్యదర్శి ఐవిపి రాజు, పట్టణ, మండల అధ్యక్షులు ప్రసాదుల ప్రసాదరావు, బొద్దుల నరసింగరావు, సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గొర్లి శ్రీనివాస్, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి బుగత అశోక్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు సుంకరి సతీష్, జనసేన నాయకులు గురాన అయ్యలు, బాలు, ఆమ్‌ఆద్మీ పార్టీ జిల్లా అధ్యక్షులు దయానంద్, లోక్‌సత్తా నియోజకవర్గ ఇన్‌ఛార్జి నాగభూషణరావు, సీనియర్ జర్నలిస్టు సురేష్, వివిధ జర్నలిస్టు యూనియన్ల ప్రతినిధులు సంఘీభావం తెలిపారు. కె.ఎల్.పురం జర్నలిస్టుల కాలనీలో ఆక్రమణలు తొలిగించి, అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ శిబిరంలో జర్నలిస్టులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో కమిషనర్ ఆకస్మిక తనిఖీలు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలోని 17, 60 నంబర్ల సచివాలయాలను కమిషనర్ ఆర్.శ్రీరాములునాయుడు గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా రికార్డులను పరిశీలించారు. స్పందన రిజిష్టర్లు సక్రమంగా నిర్వహిస్తున్నారా? లేదా? అని గమనించారు. సచివాలయం వారీగా రెవెన్యూ వసూళ్లపై ఆరా తీశారు. సఖి గ్రూపులు అధిక సంఖ్యలో ఏర్పాటుచేసి తద్వారా కౌమార బాలికలకు మానసిక, ఆరోగ్యపరంగా సంపూర్ణ అవగాహన కల్పించాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రాలను ఎప్పటికప్పుడు పరిశీలించాలని మహిళా సంరక్షణ కార్యదర్శులకు సూచించారు. పిల్లలకు సంపూర్ణ పౌష్టికాహారమందే విధంగా చూడాలని చెప్పారు. అంగన్వాడీ పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. అంశాల వారీగా వివిధ విషయాలపై సమీక్షించి తగు సూచనలు చేశారు.

సచివాలయంలో రికార్డులు తనిఖీ చేస్తున్న కమిషనర్ శ్రీరాములునాయుడు

ఆర్థిక నిర్వహణపై అవగాహన

విజయనగరం : సీతం విద్యాసంస్థల్లో మేనేజ్‌మెంట్ విద్యార్థులకు 'ఫండ్ మేనేజ్‌మెంట్ ఫర్ సీనియర్ సిటిజన్స్' అనే అంశంపై గురువారం సదస్సు ఏర్పాటుచేశారు. రామ్‌తేజ్ టెక్నాలజీస్, జపాన్ వ్యవస్థాపకులు ఎస్.సన్యాసిరావు ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమంలో జపాన్‌కు చెందిన కురి నెట్‌వర్క్ కంపెనీ అధ్యక్షులు కేనేచి ఇషికావా మాట్లాడారు. దేశంలో అధిక వనరుల లభ్యత, వినియోగం, ఆర్థిక వృద్ధిని ఏ విధంగా సాధించాలి, నూతన వ్యవస్థాపన వనరుల గురించి తెలియజేశారు. వృద్ధుల ఆర్థిక ప్రణాళిక, రిస్క్ మేనేజ్మెంట్ ఏ విధంగా ఉంటుంది, జపాన్‌లో వృద్ధులపై ఆర్థిక మాంద్యం ప్రభావం, తదితర ఆర్థిక అంశాలపై వివరించారు. అనంతరం ఆయన్ను సీతం డైరెక్టర్ ఎం.శశిభూషణరావు, ప్రిన్సిపల్ డి.వి. రామమూర్తి, విభాగాధిపతి ఎస్.వరూధిని, అధ్యాపకులు సత్కరించారు.

స్వయం ఉపాధి శిక్షణ కేంద్రం ప్రారంభం

బొబ్బిలిరూరల్: పట్టణంలో అభిమాని ఫౌండేషన్ ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్వయం ఉపాధి శిక్షణా కేంద్రాన్ని గురువారం ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ప్రారంభించారు. ప్రతీ మహిళ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఏదో ఒక నైపుణ్యాన్ని కలిగి ఉండి స్వతహాగా ఎదగడం చాలా ముఖ్యమన్నారు. 2023-24 సంవత్సరానికి గాను 600 మంది మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ, ఉపాధి కల్పనే లక్ష్యంగా ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని అభిమాని ఫౌండేషన్ చైర్మన్ రెడ్డి రాజగోపాల్ తెలిపారు.

సిఎం చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

దేవాదాయ శాఖ పరిధిలో ఆలయాల ట్రస్టు బోర్డుల్లో నాయీబ్రాహ్మణుల నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయడంతో ఆ సంఘం నాయకులు హర్షం వ్యక్తంచేస్తున్నారు. ఈ మేరకు గురువారం సిఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామిని వారు కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా కోలగట్ల మాట్లాడుతూ పాదయాత్రలో ఇచ్చిన హామీలను నెరవేరుస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే చెల్లిందన్నారు. కార్యక్రమంలో నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా అధ్యక్షులు రామేశ్వరపు రామారావు, మూగండి సూర్యనారాయణ, నాయీబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మూగండి రమణమ్మ, సంఘం ప్రతినిధులు కురువాడ సూరిబాబు, దిమిలి పైడిరాజు, తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల పనితీరుపై ఆరా

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపల్ ఉద్యోగుల పనితీరుపై కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఆరా తీశారు. పట్టణంలోని రాతిపని వారివీధి, కోరాడవీధి, జెండావీధి, బలిజిపేట రోడ్డులో బుధవారం ఆయన పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ప్రతి రోజూ పారిశుధ్య కార్మికులు చెత్త సేకరణకు వస్తున్నారా? లేదా, వీధి దీపాలు నిర్వహణ, తాగునీటి సరఫరాపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. తాగునీటిని పొదుపుగా వినియోగించాలని మహిళలను కోరారు. కార్మికులకు తడి, పొడి చెత్తను, హానికరమైన వ్యర్థాలు వేరు చేసి ఇవ్వాలని సూచించారు. కార్మికులు, మున్సిపల్ సిబ్బంది పని విధానం బాగోకపోతే తనకు దృష్టికి తేవాలని కోరారు.



మహిళలతో మాట్లాడుతున్న కమిషనర్ శ్రీనివాసరావు

శివరాత్రికి ఏర్పాట్లు పూర్తి

- రామతీర్థం, పుణ్యగిరికి లక్షల్లో యాత్రికులు వస్తారని అంచనా
- వంగర సంగమయ దేవాలయంలోనూ సర్వం సిద్ధం

ప్రజాశక్తి- నెల్లిమర్ల, శృంగవరపుకోట, వంగర

ఈ ఏడాది శివరాత్రికి శివాలయాలు సిద్ధమవుతున్నాయి. రెండో భద్రాద్రిగా పేరొందిన రామతీర్థం రామస్వామి దేవాలయంలో ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. పుణ్యగిరి ఉమాకోటి రామలింగేశ్వర ఆలయం, వంగరలోని సంగమేశ్వర ఆలయంలో కూడా శివరాత్రి ఏర్పాట్లు పూర్తిచేశారు. భక్తుల సౌకర్యార్థం బారీ కేడ్లు, తాగునీటి సౌకర్యం, మరుగుదొడ్లు వంటి ఏర్పాట్లు చేపట్టారు. కొన్ని చోట్ల వైద్య శిబిరాలను కూడా పెడుతున్నారు. ముఖ్యంగా రామతీర్థం నుంచి నెల్లిమర్ల వరకూ కాలినడకన వెళ్లిన వారు కోసం ఎక్కడికక్కడ భోజనాలకు ఏర్పాట్లు చేస్తున్నారు.

రామతీర్థంలో పూర్తయిన ఏర్పాట్లు

రామతీర్థం రామస్వామి దేవస్థానంలో ఈ నెల 18న జరగబోతున్న శివరాత్రి జాతర ఏర్పాట్లు పూర్తయ్యాయి. ముఖ్యంగా ఏటా రామస్వామి దేవస్థానంలో శివరాత్రి జాతర జరపడం ఆనవాయితీగా వస్తుంది. దీనిలో భాగంగా శివరాత్రి నాడు భక్తులు జాగరణ చేసి సీతారామసమేత లక్ష్మణస్వామిని దర్శించుకుంటారు. రామస్వామి దేవస్థానం క్షేత్ర పాలకుడు ఉమా సమేత సదాశివ స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుంటారు. రెండు రోజుల పాటు జరిగే శివరాత్రి జాతరలో ఉత్తరాంధ్ర జిల్లాలతో బాటు ఒడిస్సా రాష్ట్రానికి చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొంటారని అంచనా వేస్తున్నారు. ఈ సందర్భంగా దేవస్థానం సహయ కమిషనర్ డి.వి.వి.ప్రసాద్ ఆద్వర్యంలో జాతర ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందులో భాగంగా 50 సిసి కెమెరాలు, సతి వాడ పిహెచ్‌సి నుంచి ఉచిత వైద్య శిబిరాలు, తాగు నీటి సౌకర్యం, రామ కోనేరు వద్ద స్నానాలు గదులు ఏర్పాటు చేశారు. భక్తుల కోసం పులిహోర ప్రసాదం, రెండు చోట్ల అన్నదానం చేస్తారు. కాగా 25వేల లడ్డు ప్రసాదాలు తయారు చేశారు. ట్రాఫిక్ నియత్రణకు నెల్లిమర్ల నుంచి వచ్చే వాహనాలకు సీతారాముని పేట వద్ద, సతి వాడ నుంచి వచ్చే వాహనాలకు డి. నెలివాడ వద్ద ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు

నెల్లిమర్ల: పార్కింగ్ స్థలాన్ని చదును చేయిస్తున్న ఎస్ఐ నారాయణరావు

చేశారు. జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా 500 మందితో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. అదే రోజు నీలాచల కొండ, బొడికొండ మీద వెలసిన కోదండ రామస్వామి ఆలయంలో శిఖర దర్శనం జరుగుతుంది. శిఖర దర్శనం ఎమ్మెల్యే బడ్డుకొండ అప్పల నాయుడు జ్యోతి వెలిగించి ప్రారంభిస్తారు. విజయనగరం డిపో నుంచి 50 బస్సులు, శ్రీకాకుళం డిపో నుంచి 30 బస్సులతో భక్తులు కోసం ఏర్పాటు చేశారు. ఇప్పటికే రామతీర్థం పరిసర ప్రాంతాల్లో ఎస్ఐ నారాయణ రావు ఆద్వర్యంలో రహదారి పనులు జరుగుతున్నాయి. కాగా ఆలయం చుట్టూ బారీ కేడ్లను ఏర్పాటు చేశారు.

క్షేత్ర పాలకుడుకు ప్రత్యేక పూజలు

మహాశివ రాత్రి పర్వదినాన రామతీర్థం క్షేత్ర పాలకుడు శ్రీ ఉమాసదా శివ స్వామీ ఆలయంలో బ్రహ్మీ ముహూర్త కాలం గణపతి పూజలో స్వామి వారికి సుప్రభాతం, ఆలయ శుద్ధి, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించనున్నారు. కామాక్షి అమ్మవారి పూజ హారతి నిర్వహిస్తారు. అనంతరం భక్తులకు సర్వదర్శనం పూజలు, అభిషేకాలు, తీర్థ ప్రసాదాలు నిర్వహిస్తారు. ఆ రోజు సాయంత్రం 6.30 గంటలకు గణపతి పూజ, మహాన్యాస పారాయణ బ్రాహ్మణ ఋత్విక్కులు భక్తులతో చేయించి 11 అనువాకములాతో కూడిన ఈ అభిషేకంలో ప్రతీ అనువాకమునకు 11 రకాల పండ్ల రసాలతో భస్మ, చందన, హరిద్రా కుంకుమ, సుగంధ ద్రవ్యాల జలముతో, నారి కేళ జలముతో, అభిషేకిస్తారు.

మల్లికార్జునశర్మ

రాత్రి 12 గంటలకు మహా లింగోద్భవ సమయంలో స్వామీ వారికి ప్రత్యేక అలంకారం, భస్మ పూజ, అష్ట మూర్తి హారతి, భక్తులచే త్రయంబకం మంత్ర జపం, జరిపించి భక్తులకు విభూతి ప్రసాదం ఇస్తారు. అనంతరం స్వామీ వారి అభిషేకం నిర్వహించి అన్న అభిషేకం జరిపి స్వామివారికి చందనంతో అలంకారం చేసి, స్వామీ వారి విశ్వరూప అలంకారంతో పూల మాలలుతో మారేడు పత్రితో పూజ చేసి మహా మంగళ హారతి ఇస్తారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు, వితరణ చేస్తారని ఆలయ అర్చకులు మల్లిఖార్జున శర్మ తెలిపారు.

వంగర: మండలంలోని సంగాంలో గల సంగమేశ్వర ఆలయం వద్ద రేపటి నుంచి జరగబోయే మహాశివరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహించాలని ఎంపిపి ఉత్తరవెల్లి సురేష్ ముఖర్జీ అన్నారు. ఆలయం వద్ద గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఉత్సవాలకు విజయనగరం, శ్రీకాకుళం, విశాఖపట్నం, ఒరిస్సా తదితర ప్రాంతాల నుంచి పెద్ద సంఖ్యలో యాత్రికులు వచ్చే అవకాశం ఉన్నందున ఆలయం లోపలికి వెళ్లేందుకు క్యూలైన్లు బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. నాగావళి, సువర్ణముఖి, వేగావతి మూడు నదులు కలిసే త్రివేణి సంగమం వద్ద స్నానం చేసే వారికి దుస్తులు

వంగర: ముస్తాబవుతున్న సంగమేశ్వర ఆలయం

మార్చుకునేందుకు తాత్కాలిక గదులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో ఆలయ కమిటీ చైర్మన్ బోను ఆనంద రావు, అర్చకులు సిద్ధాంతం గణపతి రావు, గేదెల రామకృష్ణ, ఊగిరి ముత్యాల నాయుడు పాల్గొన్నారు.

ఏర్పాట్లు పరిశీలన

శృంగవరపుకోట: దక్షిణ కాశి పుణ్యగిరిలో జరిగే మహా శివరాత్రి ఏర్పాట్లను పాలక మండలి చైర్మన్ పోలమరశెట్టి రామకృష్ణ ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, ఎస్ఐ ఆర్కేశ్వరరావులు గురువారం పరిశీలించారు. మెట్ల మార్గంలో భక్తులు రాకపోకలకు ఏర్పాటు చేసిన అదనపు దారిని పరిశీలించారు. ఈ సందర్భంగా చైర్మన్ రామకృష్ణ పుణ్యగిరి కొండపై భక్తుల కోసం చేస్తున్న ఏర్పాట్లను అధికారులకు వివరించారు. శివరాత్రి రోజు భక్తులు ఇబ్బంది పడకుండా దేవి కూడలి నుండి పుణ్యగిరి కొండ మీదకు విద్యుత్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. భక్తులకు మంచినీటి సౌకర్యాలు వంటి ఏర్పాట్లు చేస్తున్నామని వీటికోసం వాలంటీర్లను వినియోగిస్తున్నట్లు తెలిపారు

ఏర్పాట్లు పరిశీలిస్తున్న తహశీల్దార్ శ్రీనివాసరావు



గ్రామస్తులతో మాట్లాడుతున్న గొంప కృష్ణ, తదితరులు

సమస్యల పరిష్కారానికి కృషి : గొంప

వేపాడ : గ్రామాల్లో ఉన్న సమస్యలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని టిడిపి నియోజకవర్గం నాయకులు గొర్ప్ కృష్ణ అన్నారు. బుధవారం రాత్రి ఆయన రాయుడుపేట గ్రామస్తులతో సమావేశమై సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను అదిష్టానం దృష్టికి తీసుకెళ్లి అధికారంలోకి వచ్చిన వెంటనే పరిష్కరిస్తామని చెప్పారు. కొంత మంది గ్రూపులుగా విడిపోయి ఐక్యమత్యంగా ఉన్న పార్టీని విడగొట్టే ప్రయత్నం చేస్తున్నారని అటువంటి వారి మాటలు నమ్మాల్సిన పనిలేదన్నారు. గత 15 సంవత్సరాలుగా తాను చంద్రబాబు ఆదేశాల మేరకు నియోజకవర్గంలో అనేక సేవా కార్యక్రమాలు చేపడుతూ వస్తున్నానని చెప్పారు. ఈ సమావేశంలో సర్పంచ్ గోకాడ లీలా, గోకాడ అప్పారావు, వైస్ సర్పంచ్ అప్పల నరసమ్మ, మాజీ వైస్ సర్పంచ్ కోటానా అర్జునరావు, బల్లంక గ్రామం మాజీ సర్పంచ్ గొర్రె నాగరాజు, మండల ఐటీ టీఎస్ అధ్యక్షుడు, వల్లంపూడి గ్రామ టిడిపి కమిటీ అధ్యక్షుడు సేనాపతి గణేష్, సిరికి రమణ తదితరులు పాల్గొన్నారు.

హమారా ప్రసాద్‌ను ఉరితీయాలి

వేపాడ : గాంధీని గాడ్సే చంపినట్లు అంబేద్కర్ బతికుంటే తానే చంపేవాడినని అనుచిత వాక్యలు చేసిన హిందుత్వవాది హమారా ప్రసాద్‌ను ఉరితీయాలని బహుజన నేత ఆతవ ఉదయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. మండలంలోని ఆతవ గ్రామంలో ఆయన గురువారం విలేకర్లతో మాట్లాడారు. దేశం గర్వించే గొప్ప నాయకుడు అంబేద్కర్ అని దేశం కోసం త్యాగం చేసిన గొప్ప మానవతావాది అంబేద్కర్ అని అటువంటి మహనీయునిపై తీవ్ర వాక్యాలు చేసిన హమారా ప్రసాద్‌ను దేశ బహిష్కరణ చేసి ఉరి తీయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి దేశ ద్రోహులు హిందుత్వ వాదులకు వ్యతిరేకంగా ఉద్యమం చేపడతామని ఉదయ్ భాస్కర్ పిలుపునిచ్చారు. కసాయి ప్రభుత్వం ఇలాంటి వారిని వెనుకేసుకొస్తుందని చెప్పారు ఈ సమావేశంలో నాయకులు కర్రి దేముడు, ఆతవ నాగరాజు, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు పూర్వ వైభవం

డెంకాడ : కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తీసుకురావాలని కాంగ్రెస్ మండల అధ్యక్షులు తెలుగు సూరిబాబు అన్నారు. మండలంలోని పెదతాడివాడ గ్రామంలో గురువారం హాత్ సే హాత్ జోడో అభియాన్ (చేయి చేయి కలుపుదాం, రాహుల్ గాంధీ నాయకత్వం బలపరుద్దాం) కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రమణ, నాయుడు, రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులపై ఆగని మోసాలు

బొబ్బిలి : విద్యార్థులపై మోసాలు ఆగడం లేదని ఎపి విద్యార్థి జెఎసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాయికిరణ్ యాదవ్ అన్నారు. స్థానిక కామ్రేడ్ గంటి ప్రసాదం స్మారక భవనం వద్ద గురువారం నిర్వహించిన పత్రికా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటర్మీడియట్ విద్యార్థులకు ఈ నెల 17న నిర్వహించనున్న ఎథిక్స్, హ్యూమన్ వాల్యూస్, పర్యావరణం పరీక్షలు తప్పనిసరిగా పాస్ అవ్వాలని ప్రభుత్వం చెప్పడంతో కళాశాల యాజమాన్యాలు అధిక మొత్తంలో విద్యార్థుల వద్ద రికార్డ్ ఫీజులను వసూలు చేస్తున్నారన్నారు. సంవత్సరం మొత్తం ఈ సబ్జెక్టులపై క్లాసులు నిర్వహించకుండా పరీక్షకు ముందు హడావిడిగా పాత రికార్డులను విద్యార్థులకు ఇచ్చి రాసి తీసుకోవడం అలవాటుగా మారిందన్నారు. విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి తగు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో వెంకటరమణ, పట్నాయక్, కిరణ్ పాల్గొన్నారు.

జిల్లాకు మంత్రి బొత్స రాక

విజయనగరం : విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ గురువారం జిల్లాకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం 10.30 గంటలకు చీపురుపల్లి చేరుకొని గృహ సారథుల సమావేశంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 1.30 గంటలకు చీపురుపల్లిలో బయలుదేరి విజయనగరం చేరుకుంటారు.

ఆర్‌కె జూనియర్ కళాశాల వార్షికోత్సవం

విజయనగరం : అయ్యన్నపేట సమీపంలోని ప్రయివేటు ఫంక్షన్ హాల్లో గురువారం ఆర్‌కె జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఆర్ఐఒ ఎం.సత్యనారాయణ హాజరయ్యారు. కళాశాల చైర్మన్ కోలా రామకృష్ణ, కరస్పాండెంట్ కోలా సంతోష్, డైరెక్టర్ కోలా అంజన, ప్రిన్సిపల్ టి.ఆదిబాబు పాల్గొని, మెరిట్ విద్యార్థులకు బహుతులను ప్రదానం చేశారు.

జగనన్న ఇళ్ల నిర్మాణానికి శంకుస్థాపన

బొబ్బిలి : జగనన్న ఇళ్ల నిర్మాణానికి గొల్లపల్లిలో మున్సిపల్ చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ గురువారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదల సొంతింటి కలను నిజం చేసేందుకు ప్రభుత్వం జగనన్న ఇళ్లను మంజూరు చేసినట్లు చెప్పారు. ఇళ్లు మంజూరైన ప్రతిఒక్కరూ పనులు పూర్తి చేసి సొంతింటి కలను నిజం చేసుకోవాలని కోరారు. రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు ప్రభుత్వం మంజూరు చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రాహుల్ నాయకత్వాన్ని బలపరచాలి

బొబ్బిలి : రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరచాలని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎం.వెంకటరమణ, పట్టణ అధ్యక్షులు ఎం.శ్రీనివాసరావు కోరారు. పట్టణంలో గురువారం 'చెయ్యి చెయ్యి కలుపుదాం.. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరుద్దాం' పేరుతో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిజెపి హయాంలో దేశాభివృద్ధి లేదన్నారు. రాహుల్ గాంధీ నాయకత్వాన్ని బలపరించేందుకు మద్దతు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

దన్నానపేటలో పారిశుధ్య పనులు

నెల్లిమర్ల : మండలం లోని ధన్నానపేట గ్రామంలో పంచాయతీ కార్యదర్శి సంతోష్ ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్యం పనులను చేపట్టారు. 'ధన్నానపేటలో అపారిశుధ్యం' అనే కథనాన్ని ప్రజాశక్తి పత్రికలో వెలువడటంతో స్పందించిన అధికారులు కాలువల్లో పేరుకుపోయిన మురుగును తొలగించారు. రోడ్డుకు ఇరువైపులా ఉన్న చెత్త పోగులను డంపింగ్ యార్డుకు తరలించినట్లు పంచాయతీ కార్యదర్శి తెలిపారు.

కాలువలో మురుగు తొలగిస్తున్న కార్మికుడు

ఆకట్టుకున్న గుర్రపు పరుగు పోటీలు

వేపాడ : మండలంలోని కేజీ పూడి గ్రామంలో బంగారమ్మ తల్లి తీర్థ మహోత్సవం సందర్భంగా గుర్రపు పరుగు ప్రదర్శన ఏర్పాటు చేశారు. ఈ పరుగు పోటీలలో 14 గుర్రాలు పాల్గొని తలబడ్డాయి. విజేతలకు మొదటి బహుమతిగా రూ. 15వేలు, రెండో బహుమతిగా రూ. 13వేలు, మూడో బహుమతిగా రూ. 12వేలు, నాల్గో బహుమతిగా రూ. 10వేలను గ్రామ పెద్దలు చేతులు మీదుగా అందించారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన

రేగిడి : మండలంలోని ఉంగరాడ మెట్ట బాలయోగి గురుకుల పాఠశాలలో జరగనున్న ఎమ్మెల్సీ పట్టభద్రుల ఎన్నికలకు సంబంధించి పోలింగ్ కేంద్రం ఏర్పాట్లను తహశీల్దార్ టి. కళ్యాణ చక్రవర్తి, ఎస్ఐ ఈ.శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు. పట్టభద్రుల ఎన్నికల పోలింగ్ కేంద్రాలు 26, 27ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ పోలింగ్ కేంద్రాలలో ఓటర్‌కు గదులలో వెలుతురు, తాగునీరు, వికలాంగు ఓటర్లకు ర్యాంప్ వంటివి పరిశీలించారు. వీరితోపాటు ప్రిన్సిపాల్ బుచ్చిరాజు, ఆర్ఐ రేవతి, ఏఎస్ఐ రాజారావు ఉన్నారు.

వంగర: వచ్చే నెలలో జరగబోయే ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గల పోలింగ్ కేంద్రాన్ని తహశీల్దార్ డి ఐజాక్,ఎంపిడిఒ వావిలపల్లి శ్రీనివాసరావు గురువారం పరిశీలించారు.

విద్యుత్తు సమస్యలు పరిష్కరించాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - బొబ్బిలి రూరల్

మండలంలో ఉన్న గ్రామాల్లో విద్యుత్ సమస్యలు ఎక్కువగా వస్తున్నాయని వాటి పరిస్కారనికి తక్షణ చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులకు ఎమ్మెల్యే శంబంగి వెంకట చినప్పలనాయుడు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం ఎంపిపి శంబంగి లక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి మండల సమావేశంలో విద్యుత్ సమస్యలపై సభ్యులు చెబుతున్నప్పటికీ విద్యుత్ శాఖ అధికారులు ఏం చర్యలు తీసుకున్నారో రాబోయే సమావేశంలో నివేధికలతో రావాలన్నారు. అధికారుల వల్ల పరిస్కారం కాని సమస్యలు తన దృష్టికి తీసుకు వచ్చినట్లయితే ఉన్నత అధికారులతో మాట్లాడి చర్యలు తీసుకొంటానన్నారు. ఈ సమస్యలు మండల సమావేశంలో తీర్మానించాలని ఆదేశించారు. ఈ ఏడాది ధాన్యం కొనుగోల్లులో రైతులకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా బిల్లులు చెల్లింపులు జరిగాయన్నారు. దీనిపై రైతులు సంతోషంగా ఉన్నారన్నారు.

బొబ్బిలి రూరల్: సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

ఈ సమావేశంలో మండల వైసిపి అధ్యక్షులు శంబంగి వేణు గోపాల్‌నాయుడు, వ్యవసాయ ఎడిఎ యం.శ్యాం సుందర్, తహశీల్దార్ రాజారావు, ఇంచార్జ్ ఎంపిడిఒ ఏ.బాస్కరరావు, జెడ్‌పిటిసి శాంతికుమారి, వైస్ ఎంపిపి, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు.

గుర్ల: మండలంలో పకీరుకిట్టలి సచివాలయం పరిధిలో పంటల ఈ క్రాప్ సక్రమంగా జరగలేదని ఎంపిటిసి జోగి నాయుడు సభ దృష్టికి తెచ్చారు. గురువారం ఎంపిపి పొట్నూరు ప్రమీల అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశాన్ని మండల పరిషత్తు కార్యాలయంలో ఎంపిడిఒ కల్యాణి నిర్వహించారు. ముందుగా ఎంపిడిఒ కల్యాణి మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున సభలో ఎటువంటి నిర్ణయాలను చేయకూడదన్నారు. ధాన్యం అమ్మకాలకు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సభ్యులు సభ దృష్టికి తీసుకొచ్చారు. ఇంకా 850 మెట్రిక్ టన్నులకు పర్మిషన్ రావలసి ఉందన్నారు. విద్యా, వైద్యం, గ్రామీణ తాగునీటి విభాగాల అధికారులు తమతమ ప్రగతి నివేదికలను సభకు తెలియచేసారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున సభ్యులు మాత్రమే సమావేశం భవనంలో ఉండాలని, ఇతరులు వెళ్లిపోవాలని ఎంపిడిఒ కల్యాణి సూచించారు. ఈ సమావేశంలో జెడ్‌పిటిసి సీర అప్పల నాయుడు, వైస్ ఎంపిపిలు తోట తిరుపతి రావు, అంబల్ల లక్ష్మి, వైసిపి నాయకులు పొట్నూరు సన్యాసి నాయుడు, ఎంపిటిసిలు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేకు వినతి

ప్రజాశక్తి - వేపాడ

మండల కేంద్రం మీదుగా సోంపురం జంక్షన్ నుండి అనందపురం వరకు గల రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్నాయి. వేపాడ - వల్లంపూడి గ్రామాలకు చెందిన కుటుంబాలు 40 అడుగులు రోడ్డు వెడల్పు చేస్తే తమ నివాసాలు దెబ్బతింటాయని వెడల్పు తగ్గించి తమను ఆదుకోవాలని ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావుకు గురువారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా ఆయన పరిశీలించి గ్రామస్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

అధికారులతో ఫోన్‌లో మాట్లాడుతున్న ఎమ్మెల్యే

రీసర్వేను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సమగ్ర భూ సర్వేను సద్వినియోగం చేసుకోవాలని తహశీల్దార్ కె.వి.రమణ రాజు సూచించారు. గురువారం బొప్పడాం సచివాలయంలో సమగ్ర భూ సర్వే పై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం భూ హక్కులు కల్పించడానికి సమగ్ర భూ సర్వే చేపట్టిందన్నారు డ్రోన్ కెమెరాలతో ఛాయా చిత్రాలు తీసీ జిరాయితి, అటవీ, ప్రభుత్వ భూములు గుర్తించడం జరుగుతుందన్నారు. డ్రోన్ సర్వేలో గుర్తించిన భూములకు సర్వే నెంబర్లు కూడా గుర్తించి అన్‌లైన్‌లో పొందుపరుస్తామన్నారు. సమావేశంలో సర్పంచ్ అంబళ్ల కిరణ్, ఎంపిటిసి బొంతు పురుషోత్తమనాయుడు, మండల సర్వేయర్ టి. మానస, సచివాలయం సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.

గరివిడి: మండలంలోని గదబవలస గ్రామంలో గురువారం భూ రీసర్వేపై తహశీల్దార్ గోవిందరావు గురువారం సమావేశం ఏర్పాటు చేసారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో జరగనున్న భూ రీసర్వేను రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రెవెన్యూ సిబ్బందికి పూర్తిగా సహకరించాలని, ఎటువంటి వివాదాలకూ తోవ లేకుండా పని పూర్తి చేయాలని కోరారు. గ్రామంలో ఉన్న నాలుగు చెరువుల్లో ఒక చెరువు పూర్తిగా ఆక్రమణకు గురైందని గ్రామానికి చెందిన యువకుడు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లాడు. ఆ చెరువులో ఉపాధి హామీ పనులు కూడా చేయడం లేదన్నారు. తహశీల్దార్ స్పందిస్తూ ప్రభుత్వ భూములను ఎవరైనా కబ్జా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సమావేశంలో ఆర్ఐ, గ్రామ సర్పంచ్ యల్లాంటి లక్ష్మి, వైసిపి నాయకులు సత్యనారాయణ, వైస్ ప్రెసిడెంట్ చొక్కాల శ్రీరాములు పాల్గొన్నారు.

420 మందికి కళ్లద్దాలు

కొత్తవలస : మండలంలోని వియ్యంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠాలలో విద్యార్థులకు ఆప్తాలమిక్ అధికారి సిహెచ్ ఈశ్వరరావు కంటి పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జాతీయ అందత్వ నివారణ కార్యక్రమంలో భాగంగా కొత్తవలస, ఎల్. కోట, వేపాడ మండలాల్లో జిల్లా పరిషత్తు పాఠశాలల్లో 8,148 మంది పిల్లలకు స్క్రీనింగ్ చేసి 420 మంది పిల్లలను కళ్లద్దాలకు ఎంపిక చేశామన్నారు. కళ్లద్దాలకు ఎంపికైన విద్యార్థులకు నెల రోజుల్లో కళ్లద్దాలు వస్తాయని తెలిపారు. పిల్లలు ఆకుకూరలు, పండ్లు, పాలు తీసుకోవాలని, జంక్ ఫుడ్స్ తినరాదని, ఒత్తిడికిలోను కావొద్దని సూచించారు.

సచివాలయ సందర్శన

వేపాడ : మండలంలోని సింగరాయ గ్రామ సచివాలయాన్ని ఎంపిడిఒ పట్నాయక్ గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా రికార్డులను తనిఖీ చేవారు. స్పందన, ఈ సర్వీస్, సంక్షేమ పథకాలు అమలు, తదితర అంశాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు.

నవధాన్యాల సాగుతో భూసారం

రేగిడి : నవధాన్యాల సాగుతో భూసారం తోపాటు జీవన వైవిధ్యం పెరుగుతుందని ఎస్‌డిఎ మాస్టర్ ట్రైనర్ శారద అన్నారు. గురువారం అడవరంలో నవధాన్యాల సాగుపై రైతులకు, ప్రజలకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి వ్యక్తి ఆరోగ్యంగా జీవించాలంటే నవధాన్యాల సాగు అవసరమన్నారు. ఈ ర్యాలీలో ప్రజా ప్రతినిధులు, వివోఏలు, గ్రామ సర్పంచ్ శోభా భుజంగరావు, వైస్ సర్పంచ్ లోలుగు పోలారావు, తదితరులు పాల్గొన్నారు.

కొత్తవలస: దేందెరు జిల్లా పరిషత్ హైస్కూల్ పిల్లలతో నవధాన్యాలు సాగుపై వ్యవసాయ సిబ్బంది గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీలో నవధాన్యాలు సాగు చేయడం వల్ల భూమికి ఏ విధంగా పోషకాలు అందుతాయి? రైతుకు సాగు చేయడానికి అయ్యే ఖర్చుని ఏ విధంగా తగ్గించుకోవచ్చునన్న విషయాలను తెలిపారు. నవధాన్యాలు సాగు చేయడం వల్ల, రసాయనికి ఎరువుల్ని వాడుకున్నా వ్యవసాయం ఏ విధంగా లాభసాటిక చేయొచ్చు అనే అంశాల పైన అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ కోటిబాబు, సిఏ శ్రావ్య, సిఆర్‌పి శ్యామల, పాల్గొన్నారు.

నాయీబ్రాహ్మణుల హర్షం

శృంగవరపుకోట : దేవాదాయ శాఖ పరిధిలో ఆలయాల ట్రస్టు బోర్డు సభ్యుల నియామకాలలో నాయి బ్రాహ్మణ సామాజిక వర్గం నుంచి ఒకరికి తప్పనిసరిగా స్థానం కల్పించాలని ప్రభుత్వం నిర్ణయించి, ప్రత్యేక ఆర్డినెన్స్ జారీ చేయడంతో మండలంలో గల నాయి బ్రాహ్మణులు హర్షాతిరేకాలు వ్యక్తం చేసారు. ఈ నేపథ్యంలో, మండల నాయి బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు గురువారం ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజుని బొడ్డవర నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి, శాలువా కప్పి తమ కృతజ్ఞతలు తెలియజేశారు. కన్వీనర్ కోడూరు శ్రీనివాసరావు, మల్లువలస సన్యాసిరావు, సిటు నాయకులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-రేగిడి

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కారానికి కృషి చేస్తామని యుటిఎఫ్ అధ్యక్షులు మురపాక గణేష్, ప్రధాన కార్యదర్శి వారాడ సత్యం నాయుడు అన్నారు. ఈ మేరకు గురువారం ఆర్. ఆముదాలవలస కాలనీ పాఠశాలలో ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ సంఘం మండల శాఖ ఎన్నికలు యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు రెడ్డి మోహన్‌రావు సమక్షంలో నిర్వహించారు.

నూతన యుటిఎఫ్ కార్యవర్గం ఎన్నిక

యుటిఎఫ్ మండల నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవధ్యక్షులుగా బి. విజయమ్మ, అధ్యక్షులుగా మురపాక గణేష్, ప్రధాన కార్యదర్శిగా వారాడ సత్యంనాయుడు, ఉపాధ్యక్షులుగా జి సింహాచలం, కే గౌరీ, కోశాధికారిగా వి ప్రవీణ్ కుమార్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికల పరిశీలుకులుగా వ్యవహరించిన పక్కి వాసు నూతన కమిటీతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు చుక్క వైకుంఠ రావు, గార రాంబాబు, జి చంద్రశేఖర్ నాయుడు, వై కిషోర్, జి విష్ణుమూర్తి, జి రామ్ కుమార్, పుర్లి గోపాల కృష్ణ, పాలవలస సురేష్ కుమార్, కే గౌరీ, ఎం విమల ఉన్నారు.

కరాటే క్రీడాకారుడికి ఘన సన్మానం

శృంగవరపుకోట : మండలంలోని ముషిడిపల్లి గ్రామానికి చెందిన ఎమ్.తరుణ్ ఈ నెల 9 నుండి 12వ వరకు విశాఖ స్వర్ణభారతి ఇండోర్ స్టేడియంలో జరిగిన మొదటి అంతర్జాతీయ కరాటే ఛాంపియన్ షిప్ అండర్-16లోని 55 కేజీల విభాగంలో పాల్గొని రజిత పతకం సాధించాడు. కోచ్ వి.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తరుణ్‌ను గురువారం ఎమ్మెల్సీ రఘురాజు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కరాటే క్రీడాకారుడుగా ఎదుగుతున్న తరుణ్ తోటి విద్యార్థులకు ఆదర్శమన్నారు. 2024 లో పారిస్‌లో జరిగే అంతర్జాతీయ కరాటే పోటీలలో రాణించి దేశానికి, మన జిల్లాకు, మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో శ్రీగౌరీ విద్యానికేతన్ హైస్కూల్ ప్రిన్సిపాల్ కె.వెంకట రాము, కోచ్ వి.శ్రీనివాసరావు, ముషిడిపల్లి పంచాయితీ మాజీ సర్పంచ్ కనకం, నాయకులు సత్యారావు, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

కమనీయం కళ్యాణం

ప్రజాశక్తి - కొత్తవలస

మండలంలోని మంగళపాలెంలో కొలువైన సీతారామ చంద్రస్వామీ ఆలయ 21వ (ఏకవింశతి) వార్షికోత్సవ వేడుకలు పురస్కరించుకుని గురుదేవా చారిటబుల్ ట్రస్టు, ఆలయ కమిటీ, గౌరీ సేవా సంఘం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉత్సవాల్లో భాగంగా గురువారం నిర్వహించిన సీతారామ, శ్రీలక్ష్మీవెంకటేశ్వర కళ్యాణ మహోత్సవం కమనీయంగా జరిగింది. ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీష్ బాబు ఆధ్వర్యంలో అయోధ్య రామమందిర్ ప్రధాన అర్చకులు సత్యేంద్ర కుమార్ దాస్ పర్యవేక్షణలో జరుగుతున్న ఈ ఉత్సవాల్లో వేలాదిమంది భక్తులు కళ్యాణ వేడుకల్లో స్వామి వారికి, అమ్మవార్లకు సారెను సమర్పించారు. వివిధ రకాల పళ్ళు, ఫలహారాలు, మిఠాయిలు, పిండివంటలను భక్తితో సమర్పించి స్వామివారిని సేవించారు. 30 మంది వేద పండితులచే శాస్త్రోక్తంగా కళ్యాణ మహోత్సవాన్ని నిర్వహించారు. అనంతరం ట్రస్ట్ చైర్మన్ రాపర్తి జగదీశ్ కుమార్, సత్యేంద్ర కుమార్ దాస్ స్వామీజీ చేతులమీదుగా 1000 మంది దంపతులకు వేద ఆశీర్వచనం, షష్ఠి యద్ది మహోత్సఆలను నిర్వహించారు. అయోధ్యరామ మందిర ప్రధాన అర్చకులు సత్యేంద్ర కుమార్ దాస్ స్వామీజీని ఈ సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ జగదీశ్ బాబు ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా భారీ ఎత్తున తీర్థప్రసాదాలు, అన్నసమారాధన కార్యక్రామాలు నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు, గ్రామ పెద్దలు, గౌరీ సేవా సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలలో ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -గరివిడి

మండలంలోని కాపు శంభం హై స్కూల్‌ను గురువారం సాయంత్రం డిప్యూటీ డిఇఒ కె. వాసుదేవరావు ఆకస్మికంగా తనిఖీ చేశారు. పదో తరగతి విద్యార్థులకు తెలుగు గ్రాండ్ టెస్ట్ జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. పరీక్ష అనంతరం విద్యార్థులకు మంచి మార్కులు సాధించడానికి గల సూచనలు చేశారు. ఉపాధ్యాయులంతా సంబంధిత సబ్జెక్ట్‌లపై ఎప్పటి కప్పుడు విద్యార్థులను పరిశీలించాలన్నారు. ప్రతిరోజు పరీక్షలు జరగాలన్నారు. ఈ పాఠశాలలో జరుగు పరీక్ష విధానం పై సంతృప్తి చెందారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు దూళికేశ్వరరావు, ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

పరీక్షలను పరిశీలిస్తున్న డిప్యూటీ డిఇఒ వాసుదేవరావు

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

శృంగవరపుకోట : విద్యుత్ షాక్‌నకు గురై పిల్లా వెంకటరావు(40) గురువారం మృతి చెందాడని ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కొట్టం గ్రామానికి చెందిన పిల్లా వెంకటరావు వృత్తి రీత్యా తాపీ మేస్త్రి. అదే గ్రామానికి చెందిన ఏడువాక అచ్చం నాయుడు ఇంటి నిర్మాణ పని చేస్తుండగా బోరు బావి యొక్క విద్యుత్ మోటారు పనిచేయకపోవడంతో పిల్లా వెంకటరావు విద్యుత్ మోటారును రిపేరు చేశాడు. ఈ క్రమంలో అకస్మాత్తుగా విద్యుత్తు సరఫరా కావడంతో షాక్‌నకు గురయ్యాడు. వెంటనే స్థానికులు హుటాహుటిన క్షతగాత్రుని పట్టణంలోని ఏరియా ఆసుపత్రికి తరలించారు. వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు వెంకటరావు అప్పటికే మృతిత చెందాడని నిర్ధారించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

చెట్టు పైనుంచి పడి గీత కార్మికుడు మృతి

గజపతినగరం : ప్రమాదవశాత్తు చెట్టు పైన నుంచి పడి గీత కార్మికుడు మృతి చెందాడు. మండలంలోని గంగచోళ్ల పెంట గ్రామానికి చెందిన ముంత అడవియ్య (42) గురువారం మధ్యాహ్నం తాటి కళ్లు కోసం తాటి చెట్టు ఎక్కాడు. ఒక్కసారిగా కాలు జారడంతో చెట్టు పైనుండి కిందకు పడిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్లిపోయిన అతన్ను స్థానికులు, కుటుంబ సభ్యులు వెంటనే జిల్లా కేంద్రాస్పత్రికి తరలించారు. అక్కడ వైద్య పరీక్షలు నిర్వహించిన డాక్టర్లు అడవియ్య మృతి చెందినట్లు నిర్ధారించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.